ఏడాదిలోపే కూటమిపై ప్రజా వ్యతిరేకత

వైఎస్సార్‌సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



శ్రీరంగపురం కార్యక్రమంలో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే అన్ని వర్గాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత మూట గట్టుకుందని వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలు మండలంలోని శ్రీరంగపురం, తోట్లపాలెం, మంచాల, కొత్తరెడ్డిపాలెం గ్రామాల్లో గురువారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు ఆళ్ల శ్రీరామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ స్థానిక ప్రజలతో కలిసి నేలపై కూర్చొని కూటమి మోసాలపై ప్రజలకు వివరించారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన చంద్రబాబు మోసపూరిత మేనిఫెస్టో కరపత్రాలు విడుదల చేశారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో చంద్రబాబు ప్రజలను మోసం చేశారని ఆయన ఆరోపించారు.

గాలికొదిలిన హామీలు..

కూటమి ప్రభుత్వం ఇస్తానని చెప్పిన ఆడబిడ్డ నిధి నెలకు రూ.1500లు, అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు భృతి ఏడాది అయిన అందించకుండానే అన్నీ ఇచ్చామని మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించిన వీడియోను అంబటి మురళీకృష్ణ ప్రజలకు చూపించారు. ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే ఆంధ్రాను అమ్మేయాలని చెప్పడం ప్రజలను మోసం చేయటమేనన్నారు. సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేశారని ఆయన మండిపడ్డారు. పేదల మనిషి జగనన్న ఐదేళ్ల పాలనలో ఎన్నికల హామీలను 99 శాతం అమలు చేశారని గుర్తుచేశారు. మోసం అంటే చంద్రబాబు, నమ్మకం అంటే జగన్ అని ప్రజలకు గుర్తుకు వస్తాయన్నారు. ఆయా కార్యక్రమాలలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొక్కిలగడ్డ కిరణ్‌కుమార్, అన్నదాసు సుబ్బారావు, దానమ్మ, కఠివరపు ఆశాజ్యోతి, చందు వెంకట సాంబశివరావు, సీహెచ్ భాస్కరరావు, జి.అంకమ్మరావు, అశోక్, సనకా వెంకట సుబ్బయ్య, సూదా గణేష్ తదితరులు పాల్గొన్నారు.



మంచాల గ్రామంలో కూటమి మోసాలను వివరిస్తున్న మురళీకృష్ణ

మురుగు సమస్యతో అవస్థలు పడుతున్నాం



వృద్ధురాలితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

చేబ్రోలు: గ్రామంలో మురుగు సమస్య తీవ్రంగా ఉందని చేబ్రోలు మండలం మంచాల గ్రామస్తులు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి గురువారం తెలియజేశారు. మండల పరిధిలోని నారాకోడూరు గ్రామంలో పీ–4 కార్యక్రమంపై గ్రామ సభ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి గుండవరం, మంచాల గ్రామాల్లో సచివాలయ సిబ్బందితో కలిసి బంగారు కుటుంబాల ఇంటికి వెళ్లి నీడ్ అసెస్మెంట్ సర్వేను నిర్వహించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా పలువురిని కలిసి వారి ఆర్థిక పరిస్థితులను తెలుసుకున్నారు. వారి వివరాలు, కావాల్సిన సహాయాలను జిల్లా కలెక్టర్ సర్వే యాప్‌లో స్వయంగా నమోదు చేశారు. మంచాల గ్రామంలోని ఎస్టీ కాలనీలో పలువురు తమ సమస్యలను ఆమెకు విన్నవించుకున్నారు. నిరుపేదలమైన మాకు నివాసం ఉండడానికి ఇళ్లు లేదని.. ఇళ్ల స్థలం ఇప్పించాలని పలువురు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో వి.జ్యోతి బసు, సీపీవో శేషశ్రీ, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి, మండల స్పెషల్ ఆఫీసర్ వందనం, ఎంపీడీవో టి.ఉషారాణి, తహసీల్దారు కె.శ్రీనివాసశర్మ, మంచాల గ్రామ సర్పంచ్ చందు సాంబశివరావు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన కోసమే పీ–4 కార్యక్రమం



గ్రామసభలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

చేబ్రోలు: సమాజంలో పేదరిక నిర్మూలన దాతలతో పాటు ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమని.. అందుకు ప్రభుత్వం పీ–4 కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామంలో గురువారం పీ–4 కార్యక్రమంపై గ్రామ సభ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన నాగలక్ష్మి మాట్లాడుతూ.. ఆర్థిక స్థోమత కలిగిన వ్యక్తులు బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని పీ–4 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం గుండవరం, మంచాల గ్రామాల్లో పీ–4 నీడ్ అసెస్మెంట్ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజనా సింహ, జెడ్పీ సీఈవో వి.జ్యోతి బసు, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి, ఎంపీడీవో టి.ఉషారాణి, తహసీల్దార్ కె.శ్రీనివాస శర్మ, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీడిత వర్గాల గొంతుక జాషువా కవిత్వం



ఏఎన్‌యూ కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్య త్రిమూర్తిరావు, ఆచార్య పీజే రత్నాకర్

పెదకాకాని: మన సమాజంలో పీడిత, బాధిత వర్గాల గొంతుకగా గుర్రం జాషువా కవిత్వం నిలిచిందని యూనివర్సిటీ పూలే అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య ఎం.త్రిమూర్తిరావు, బాబూ జగ్జీవన్ రామ్ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం కవి గుర్రం జాషువా వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అతిథులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య త్రిమూర్తిరావు మాట్లాడుతూ.. సమాజంలో నిరాదరణకు గురైన వారి ఆవేదనను జాషువా తన కవిత్వం ద్వారా సమాజానికి తెలియజేయడంతో పాటు వాటి నిర్మూలనకు కూడా మార్గం చూపారన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆచార్య పీజే రత్నాకర్ మాట్లాడుతూ.. తాను ఎదుర్కొన్న అవమానాలు, వివక్షతలను అక్షరమనే ఆయుధంగా మలచుకుని వాటి నిర్మూలనకు విలక్షణమైన పోరాటం చేసిన గుర్రం జాషువా సదా ఆచరణీయుడన్నారు. అధ్యాపకేతర సిబ్బంది సంఘ నాయకులు కె.కనకరాజు, కె.జేమ్స్ మాట్లాడుతూ.. జాషువా ఈ ప్రాంతంలో జన్మించడం మనందరికీ గర్వకారణమన్నారు. పరిశోధకుడు శ్యాంసన్ మాట్లాడుతూ.. జాషువా జన్మస్థలమైన పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలన్నారు. అనంతరం పరిశోధకులు పి.అభిషేక్, రోహిణి, బి.కోటియాదవ్, అధ్యాపకుడు డాక్టర్ నాగరాజు ప్రసంగించారు. పరిశోధకులు వై.రాజేష్, డాక్టర్ సునీల్, శాస్త్రి, థామస్, డాక్టర్ ఎస్.అశోక్‌కుమార్, పలువురు పరిశోధక సంఘ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలం చెల్లినా.. అంటగట్టేస్తాం...

- మార్కెట్‌లో యథేచ్ఛగా నకిలీ,
- నాణ్యతలేని వస్తువుల విక్రయాలు
- అప్రమత్తతతోనే అడ్డుకట్ట వేయగలం
- మొద్దునిద్ర పోతున్న ఫుడ్, తూనికొలతల శాఖల అధికారులు



మార్కెట్‌లోని ఒక దుకాణంలో 2024లోనే కాలం చెల్లిన తేనె బాటిల్‌ను విక్రయించిన దృశ్యం

పట్నంబజారు: నగరంలోని పట్నంబజారు వాణిజ్య, వ్యాపారాలకు పెట్టిన పేరు. ఏదీ కావాలన్న గృహోపకరణాలకు ఇక్కడ లభించని వస్తువులు ఉండవు. అటువంటి పరిస్థితుల్లోనే.. వ్యాపారల సముదాయాల ప్రాంతం కల్తీలకు.. కాలం చెల్లిన వస్తువుల ఖిల్లాగా మారిపోయింది. ఓ భక్తుడు పూజా సామాగ్రిని కొనుగోలు చేస్తే కాలం తీరిన తేనే బాటిల్ వచ్చింది. అది ఆయన ఆలయంలో అర్చకులకు ఇస్తే.. స్వామి వారికి నివేదించి తీర్థంగా ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. తనిఖీలు చేయాల్సిన అధికారులు మాత్రం మూగనోమును తలపించేలా వ్యవహరిస్తున్నారు. మనం కొనుగోలు చేసే ప్రతి వస్తువులోనూ.. ఎటువంటి లోపం లేకుండా సరైన ధర, తూకం, నాణ్యత, స్వచ్ఛత కలిగినవి పొందే హక్కు వినియోగదారులకు ఉంది. అయితే ప్రస్తుతం మోసాలు ఎక్కువైపోయాయి. మరోవైపు వినియోగదారుల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అధికారులు, కనీసం వాటిపై దృష్టి సారించటం లేదు.

ఇలా ఫిర్యాదు చేద్దాం..

వినియోగదారులు నష్టపోయామని భావిస్తే జిల్లాలో అయితే డీసీఐసీ, మండలాల్లో అయితే ఎంసీఐసీ ద్వారా కేవలం తెల్లకాగితంపై రాసి ఇస్తే సరిపోతుంది. అయితే కచ్చితంగా రసీదు ఉండాలి. విక్రయించే ప్రతి వస్తువుపైనా ఎమ్మార్పీ తయారు చేసిన తేదీ, ఎక్స్పైరీ డేట్, వినియోగదారుల హెల్ప్ లైన్ చెందిన నంబరు విధిగా ముద్రించి ఉండాలి. అలా లేకపోతే వస్తువుల విక్రయ దుకాణాలపై ప్రభుత్వం జరిమానా విధించాలి. అనుమతి లేకుండా సినిమా టికెట్లు అధిక ధరలకు అమ్మినా, తూకాల్లో తేడాలున్నా, సేవల్లో లోపాలను పసిగట్టినా ఫిర్యాదు చేయొచ్చు.

చట్టంపై అవగాహన అవసరం..

వినియోగదారుల రక్షణ చట్టం– 2019 ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి. నాణ్యత లేని ఉత్పత్తులు, తప్పుడు ప్రకటనలు, అధిక ధరలు, సరైన సేవలు అందక పోవడం వంటి సమస్యల నుంచి పరిహారం కోసం వినియోగదారులకు రక్షణ చట్టం అమల్లో ఉంది. మారుతున్న కాలానికి, సాంకేతిక సౌలభ్యానికి అనుగుణంగా ఈ–కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్‌పై నియంత్రణ ఈ చట్టంలో ఉంది. జిల్లా కమిషన్ ఎదుట కోటి రూపాయల లోపు, రూ.కోటి నుంచి రూ.10 కోట్ల మధ్య రాష్ట్ర కమిషన్ ఎదుట, రూ.10 కోట్ల పైబడిన కేసులు జాతీయ కమిషన్ ఎదుట దాఖలు చేయవచ్చు. వినియోగదారులు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉంది.


భగవద్గీత జ్యోతిపై ప్రవచనం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణ వేదికపై గురువారం భగవద్గీత జ్యోతి– మనో మార్గదర్శి జుగల్బందీ వ్యాఖ్యాన పూర్వక ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. కోట రామలక్ష్మి భగవద్గీతలోని శ్లోకాలను పఠించారు. భగవద్గీతలోని అంతరార్థాలను విపులంగా వివరించారు. కాటూరి వైద్య కళాశాల మానసిక వైద్య అధ్యాపక వైద్యులు కోట సురేష్‌కుమార్ భగవద్గీతలోని పాత్రలు, వారి ప్రవర్తన, సుఖ దుఃఖాల సమాహారాన్ని, మానసిక స్థితులను తెలియజేశారు. భగవద్గీతను అనుసరించి నేటి కాలంలో మానవులు అనుసరించాల్సిన నీతి, నియమాలను తెలిపారు.

బీరు సీసాతో దాడి చేసిన వ్యక్తిపై కేసు

లక్ష్మీపురం: మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదని బీరు సీసాతో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీనివాసరావుపేటకు చెందిన తన్నీరు సునీల్‌కుమార్ కారు డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అయితే ద్విచక్రవాహనం లేకపోవడంతో సునీల్ స్నేహితుడు రాకేష్‌కు సాయంత్రం ఫోన్ చేసి విద్యానగర్ వరకు వెళ్లేందుకు రావాల్సిందిగా పిలిపించుకున్నాడు. ఇద్దరు కలిసి వాహనంపై వెళుతుండగా శ్రీనివాసరావు పేట వడ్డేరగూడెం వద్ద దేవరాజు అనే వ్యక్తి పూటుగా మద్యం తాగి వాహనాన్ని అడ్డగించాడు. సునీల్‌ను మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాల్సిందిగా దేవరాజు నిలదీయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా దేవరాజు బీరు సీసాతో సునీల్‌పై దాడి చేసి గాయాలు పాలు చేయడంతో స్థానికుల సహాయంతో జీజీహెచ్‌లో చికిత్స పొందారు. అనంతరం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ



తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రతి నెలా వచ్చే అమావాస్య సందర్భంగా మంగళగిరిలోని పుణ్యక్షేత్రంలోని దేవాలయాల దర్శనార్థం వచ్చే భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాకర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పుప్పాల కోటేశ్వరరావు, ట్రస్ట్ సభ్యులు నంగళం ప్రసాద్, వడ్లమూడి వెంకయ్య చౌదరి, కర్నాటి శివన్నారాయణ, బేతపూడి మధుబాబు, ఉమామహేశ్వరరావు, సుబ్బరాజు, ఆదిలక్ష్మి, జనసేన నాయకులు తిరుమలశెట్టి కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

వీవీఐటీయూలో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్



కార్యక్రమానికి హాజరైన అయిదు దేశాల ప్రతినిధులతో డాక్టర్ మల్లికార్జునరెడ్డి

పెదకాకాని: విద్యార్థులు బహుళ దేశాలలో విద్యా, అధ్యాయన అవకాశాలపై అవగాహన కలిగించేందుకు గానూ ఐడీసీ గుంటూరు ఆధ్వర్యంలో వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నోలాజికల్ యూనివర్సిటీలో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్–2025 నిర్వహించారు. నంబూరు వీవీఐటీయూలో గురువారం జరిగి ఈ కార్యక్రమానికి అయిదు దేశాల నుంచి 13 విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సదస్సును వీవీఐటీయూ రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అపార విద్యా అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. ఐడీసీ గుంటూరు మేనేజర్ రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని విషయాలు తెలుసుకున్న తర్వాతనే ఉన్నత విద్య గురించి నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. ఈ సదస్సులో యూఎస్‌ఏ నుంచి నార్త్ ఈస్టరన్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్ సిన్, గవర్నర్స్ స్టేట్ యూనివర్సిటీ, రూజ్ వెల్ట్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ మెమిఫిస్, విలియమ్ పేటర్సన్ యూనివర్సిటీ, నోవా సౌత్ ఈస్టరన్ యూనివర్సిటీ ప్రతినిధులు, ఆస్ట్రేలియా నుంచి మోనాష్ యూనివర్సిటీ ఎడిత్ కోవన్ యూనివర్సిటీ, యూకే నుంచి మాంచెస్టర్, మెట్రో పొలిటన్ యూనివర్సిటీ, బాత్ యూనివర్సిటీ, కెనడా నుంచి నార్త్ ఈస్టరన్ యూనివర్సిటీ ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో వీవీఐటీయూ డీన్ డాక్టర్ ఎంవీ రఘురామ్, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ యు.మాధవ్, ప్రోగ్రామ్ కోర్డినేటర్ డాక్టర్ వి.పావెల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే సైబర్ మోసాలకు అడ్డుకట్ట



విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న సీఐ వీరానాయక్

పొన్నూరు: అప్రమత్తత, అవగాహనతోనే సైబర్ మోసాలకు గురికాకుండా తప్పించుకోగలమని పట్టణ సీఐ వీరానాయక్ అన్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పట్టణంలోని వివేకా స్కూల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగాక సైబర్ నేరాలు పెరిగాయని అన్నారు. సైబర్ నేరగాళ్లు అనేక రకాలుగా మోసం చేసేందుకు ప్రయత్నిస్తారని, అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కళాశాలలు, పాఠశాలల్లో ఈవ్ టీజింగ్ జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పుడు మార్గాల్లో పయనిస్తే భావి జీవితం అంధకారం

డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో తప్పుడు మార్గాల్లో పయనిస్తే భావి జీవితం అంధకారంగా మారుతుందని ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అన్నారు. జేకేసీ కళాశాలలో గురువారం మాదక ద్రవ్యాలు– వాటి దుష్పరిణామాలు, ఈవ్ టీజింగ్, రాష్ డ్రైవింగ్‌పై ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో క్రమశిక్షణతో మెలగాలని, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వంటి దుశ్చర్యలకు పాల్పడిన పక్షంలో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. సోషల్ మీడియాను విజ్ఞానాభివృద్ధి కోసం వినియోగించాలని, ముఖ్యంగా విద్యార్థినులు ఇన్‌స్ట్రాగాం, ఫేస్‌బుక్‌ల ద్వారా అపరిచిత వ్యక్తుల పరిచయాలకు దూరంగా ఉండాలని సూచించారు. సదస్సులో సీఐ జి. వెంకటేశ్వర్లు, ఎస్ఐ నూతక్కి నరహరి, బి.నారాయణ, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్‌లో ఉద్యోగంలో చేరిన కళాశాల పూర్వ విద్యార్థిని ఎం.కృష్ణకుమారి, కళాశాల ప్రిన్సిపాల్ పి. గోపీచంద్, పి.నాగసుశీల, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికార సాధనతోనే బీసీ వర్గాల అభివృద్ధి

నెహ్రూనగర్: రాజ్యాధికార సాధనతోనే బీసీ వర్గాల నిజమైన అభివృద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు పావులూరి హనుమంతరావు పేర్కొన్నారు. బుధవారం అరండల్‌పేటలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 52 శాతం జనాభా ఉన్న బీసీలు రాజకీయ ఆర్థిక సామాజిక అభివృద్ధి లేకపోవడం దురదృష్టకరమన్నారు. చట్ట సభల్లో బీసీల ప్రాతినిధ్యం కోసం ఈ నెల 26, 27వ తేదీన కడప, అనంతపురంలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీ కులాల నాయకులు మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.8

రమణయ్య సేవలు చిరస్మరణీయం



అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని 28వ డివిజన్ కార్పొరేటర్ పడాల సుబ్బారెడ్డి అన్నారు. గురువారం పట్టాభిపురంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రేడ్–3 గ్రంథ పాలకురాలు పి.సత్యశిరీష, విశ్రాంత సీనియర్ అసిస్టెంట్ ఇమ్రాన్‌ఖాన్, పాఠకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల ప్రాధాన్యం చాటిన అయ్యంకి

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రంథాలయాల ప్రాధాన్యం చాటిన అయ్యంకి వెంకట రమణయ్య స్ఫూర్తితో విద్యార్థులు పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని ఆర్జించాలని హిందూ కళాశాల ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ పి.వేణుగోపాల్ పేర్కొన్నారు. గురువారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాల గ్రంథాలయంలో జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథ పాలకుడు డీవీ సుబ్బారావు, గ్రంథాలయ అభివృద్ధి సంఘ సమన్వయకర్త సీహెచ్ అరుణ, మహిళాభివృద్ధి విభాగ కన్వీనర్ వి.బ్యూలారాణి, సహాయ గ్రంథ పాలకురాలు శ్రీజ, విద్యార్థులు పాల్గొన్నారు.

27న ఉచిత మెడికల్ క్యాంప్

తాడేపల్లి రూరల్: ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను ఈనెల 27న నిర్వహించనున్నట్లు మానవ సేవా సంస్థ వ్యవస్థాపకులు వంగర సురేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దుగ్గిరాల మండల పరిధి పెదకొండూరు గ్రామం శ్రీ కనకపుట్లమ్మ దేవస్థానం ఫంక్షన్ హాల్‌లో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. దుగ్గిరాల మండల పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

31లోగా మీడియా డిస్‌ప్లే ఫీజు బకాయిలు చెల్లించాలి



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని మీడియా డివైజ్ డిస్‌ప్లే బోర్డ్స్ నిర్వాహకులు ఈ నెల 31వ తేదీలోగా బకాయిలు మొత్తం చెల్లించాలని, చెల్లించని వారి బోర్డులను ఆగస్ట్ ఒకటో తేదీ నుంచి తొలగించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో మీడియా డివైజ్ డిస్‌ప్లే బోర్డ్స్ నిరాహకులతో ఫీజుల బకాయిలపై ప్రత్యేక సమావేశం గురువారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 31 సాయంత్రానికి సమగ్ర నివేదిక ఇవ్వాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. నగరంలో ఆగస్ట్ ఒకటి నుంచి అనధికార, బకాయిలు ఉన్న సంస్థల ప్రకటనల బోర్డ్‌లు, హోర్డింగ్స్ ఉండడానికి వీలు లేదన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ రెహ్మాన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్రెయిన్ల శుభ్రతపై దృష్టి సారించాలి



గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని శివారు ప్రాంతాల్లో అవుట్ ఫాల్ డ్రెయిన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని.. అంతర్గత డ్రెయిన్‌లు మేజర్ డ్రెయిన్లలో కలిసే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మెష్‌ల వద్ద నిలిచే వ్యర్థాలను తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ గోరంట్ల, రెడ్డిపాలెం, సరస్వతినగర్, జయంతినగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ ఐజాక్, టీపీఎస్ లక్ష్మణస్వామి, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం రేపు

గుంటూరు రూరల్: రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల పరిషత్ అధ్యక్షురాలు ఇంటూరి పద్మావతి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

స్వచ్ఛ రథాన్ని సద్వినియోగం చేసుకోవాలి



గుంటూరు రూరల్: స్వచ్ఛ రథాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి నాగ సాయికుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని మల్లవరం గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు. పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేసి తడి, పొడి చెత్త సేకరిస్తున్న విధానాన్ని.. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో జరుగుతున్న వర్మి కంపోస్టింగ్ విధానాన్ని.. శానిటేషన్‌కి సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో తిరిగి ప్రజలతో మాట్లాడారు. శనివారం మల్లవరం గ్రామపంచాయతీలో స్వచ్ఛ రథ కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రోజాప్రకాష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

గుంటూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో వారం రోజులపాటు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.యుగంధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28వ తేదీ నుంచి ఆగస్టు 3వ తేదీ వరకూ లాంఫాంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తారని ఆయన అన్నారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ ఈ శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు 94900 35258 నంబరులో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



కాకుమాను: పెదనందిపాడు మండలం గోగులమూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని గురువారం ఎంఈవో కె.ఎఫ్.కెన్నడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజూ రుచికరమైన ఆహారాన్ని సిద్ధం చేసి ప్రతి విద్యార్థికీ అందించాలని ఆయన సూచించారు. ఉపాధ్యాయులు రోజూ మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షిస్తూ ఉండాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో ఎంఈవో–2 జాకబ్, హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

పొన్నూరు: యోగాతో మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యం పదిలంగా ఉంటుందని యోగాచార్య మలిశెట్టి సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని స్వాములు కాంప్లెక్స్‌లో శ్రీ వీరాంజనేయ యోగా సాధన సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచిత యోగా తరగతులను గురువారం నిర్వహించారు. ప్రతి ఒక్కరినీ ఆరోగ్యవంతులను చేయడమే ధ్యేయంగా యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉచితంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో అందరూ పాల్గొనవచ్చని అన్నారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.